క్లుప్తంగా

ఘనంగా విజయగణపతి దేవస్థాన వార్షికోత్సవం


ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ దంపతులు, ఆలయ నిర్వాహకులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి బాపునగర్‌లోని జ్ఞాన మందిర్ విజయగణపతి దేవస్థానం 22వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బీజేపీ నగర యువనేత వినయ్‌కుమార్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎంఆర్ సత్యనారాయణ, అశ్వినీ, కమిటీ సభ్యులు అశోక్‌కుమార్, బాలకృష్ణ, గంగాధర్‌లు కార్పొరేటర్ దంపతులను సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు, రాజేందర్, ఆనంద్‌రావు, సాయికుమార్, డేవిడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానలహరి


బాలకామేశ్వర్‌రావును సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి: సల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఘంటసాల గానలహరి కార్యక్రమం ఆకట్టుకుంది. త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ గాయకులు బాలకామేశ్వర్‌రావు తదితర గాయనీగాయకులు ఘంటసాల గీతాలను ఆలపించారు. ప్రముఖ కవి డాక్టర్. ఎంకే రాము, జ్యోతిష్యులు హనుమంతరాయశర్మ, న్యాయవాది శ్రీనివాసరావు, నిర్వాహకులు, నటులు దొంతి జంగయ్యగౌడ్, లాలయ్యగౌడ్, గడ్డం లాలయ్య చౌదరి, మధుసూదన్‌రెడ్డి, జీడీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు ఉంటుంది


పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: నందమూరి తారకరామారావు గొప్ప నటుడని ఎమ్మెల్సీ మధుసూదనాచారి కీర్తించారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో యుగపురుషుడు ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ కీర్తి పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఆయన పేరు నిలిచి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. లంకా లక్ష్మీనారాయణ, రాందాస్‌తేజ, ఆయూబ్‌ఖాన్, మూసా అలీఖాన్, కాశీకృష్ణ, ప్రసాద్‌బాబు, శ్రావణి, అనూష, డాక్టర్ షేక్ ఫకీర్‌బాబా, డాక్టర్ ఎం.మాధవరావు, పద్మారెడ్డి, శ్రీనివాస్, వెంకటరమణ, సత్యనారాయణరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న బీజేపీ నేత ఎన్.గౌతంరావు

కాచిగూడ: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, సూర్యప్రకాష్‌సింగ్, కన్నె రమేష్‌యాదవ్, అజయ్, ఆనంద్, బుచ్చిరెడ్డి, శ్యామ్, రవీందర్, సంతోష్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


వర్టికల్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత


త్రీడీ ఎఫెక్ట్‌తో ఏర్పాటు చేసిన ప్రముఖ భవనాలు, దర్శనీయ స్థలాల చిత్రాలు

- హుస్సేన్‌సాగర్ నాలాపై రూ. 40 లక్షలతో వర్టికల్ గార్డెన్ ప్రారంభం
- ఆకట్టుకుంటున్న దర్శనీయ స్థలాల త్రీడీ ఎఫెక్ట్ చిత్రాలు

నల్లకుంట: సీఎం కేసీఆర్ సూచనలు, మంత్రి కేటీఆర్ సహకారం, ఆదేశాలతో అంబర్‌పేట్ నియోజక వర్గాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. దీనిలో భాగంగానే నియోజక వర్గంలో సుమారు రూ.10 కోట్లతో పార్కుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు వివరించారు.

- ఎమ్మెల్యే నిధులతో నాలాలపై వర్టికల్ గార్డెన్‌ల నిర్మాణ పనులను చేపట్టినట్లు ఆయన వివరించారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్, శివానంద్ నగర్‌లను ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్ సాగర్ నాలా బ్రిడ్జిపై రోడ్డుకు ఇరువైపులా రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన వర్టికల్ గార్డెన్‌ను బుధవారం కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.
- సీఎం కేసీఆర్ నగరాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని పరిశుభ్రత పాటు నాలాలపై వర్టికల్ గార్డెన్‌ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు.
- గతంలో రత్నానగర్ సమీపంలోని హుస్సేన్‌సాగర్ నాలా బ్రిడ్జిపై బాటసారులు మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్వాసన వెలువడేదని పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. – బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే బడ్జెట్ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి బ్రిడ్జికి ఇరువైపులా వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు.
- వర్టికల్ గార్డెన్‌లో వివిధ రకాల పూల మొక్కల ఏర్పాటుతో బ్రిడ్జిపై వాయు కాలుష్య తీవ్రత తగ్గుతుందని పేర్కొన్నారు. గార్డెన్ మధ్య ప్రముఖ భవనాలు, దర్శనీయ స్థలాల త్రీడీ ఎఫెక్ట్‌తో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. రాత్రివేళ ఈ బ్రిడ్జిపై నుంచి ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో నీటి సమస్య పరిష్కారం..

కాచిగూడ: నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సొంత ఖర్చులతో పవర్ బోర్స్, హ్యాండ్ బోర్స్ వేయిస్తూ.. ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో పాదయాత్ర సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 25 వరకు పవర్ బోర్స్, 15 వరకు హ్యాండ్ బోర్స్ వేయించినట్లు స్థానిక బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కాచిగూడ డివిజన్‌లో బండల బస్తీలో నూతనంగా పవర్ బోర్ వేయించారు. విక్రమ్‌నగర్ బస్తీ, జైన్ సంఘం వద్ద పవర్‌బోర్లు వేయించారు. హరిమజీద్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో హ్యాండ్ పంపులకు మరమ్మతులు చేయించారు.


బర్కత్‌పురలో ఎమ్మెల్యే ఏర్పాటు చేయించిన పవర్ బోర్

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలి

- ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం


ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కవాడిగూడ: రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ప్రజలందరికీ విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వాలని కోరుతూ.. ఉచిత వైద్య, విద్యాసాధన సమితి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ప్రొఫెసర్ కోదండరాం పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు సదానందరెడ్డి, ఉచిత విద్య, వైద్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, టీజేఎస్‌గ్రేటర్ కార్యదర్శి ఎం నర్సయ్య హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. విద్య, వైద్యానికి కనీస బడ్జెట్ కేటాయించలేని దుర్మార్గపు పాలన నడుస్తోందని ఆరోపించారు. సదానందరెడ్డి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, సుధాకర్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌నాయక్, సాయికుమార్, బద్రయ్య తదితరులున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయం


భూమిపూజ చేస్తున్న ప్రసన్నరామ్మూర్తి తదితరులు

చిక్కడపల్లి: గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామని నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి తెలిపారు. హైదరాబాద్ నగర గ్రంథాలయంలో ఆమె బుధవారం మాట్లాడుతూ.. ఉప్పుగూడలో నిర్మించనున్న నూతన భవనానికి సంస్థ కార్యదర్శి పద్మజతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర కేంద్ర గ్రంథాలయ పరిధిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ, 81 శాఖాగ్రంథాలయాలకు రూ.65 లక్షలతో నూతన పుస్తకాలు కొనుగోలు చేసి పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు.

- సికింద్రాబాద్‌లో రూ.3 కోట్లతో అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మించామని ఎంతో మంది విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వసతులు కల్పించామన్నారు.
- చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచామని రోజూ నగర కేంద్ర గ్రంథాలయానికి మూడువేల మంది పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు వస్తుంటారన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్, పౌరగ్రంథాలయశాఖ డైరెక్టర్ శ్రీనివాసచారి నేతృత్వంలో పలు అంశాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వేసవిలోపు నాలాల పనులు పూర్తి చేయాలి


పటేల్‌నగర్‌లో నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వేసవికాలం ముగిసేలోపు నాలాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం అంబర్‌పేట్ డివిజన్‌లో రూ.22 కోట్లతో జరుగుతున్న నాలా విస్తరణ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి వర్షాకాలంలో జనావాసాలు ముంపునకు గురవుతున్నాయని ఆ సమస్యలను అధిగమించేందుకు శాశ్వత ప్రాతిపాదికన నాలాల అభివృద్ధిని చేపడుతున్నామన్నారు. నాలాల నిర్మాణ పనులు పూర్తయితే భవిష్యత్తులో వరద సమస్యకు శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. అధికారులు ప్రదీప్, సాయిబాబా, ప్రేమ్‌రాజ్ స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శబ్దం మనిషి గుండెల్ని చీల్చుకుపోతుంది


అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రజాగాయకుడు గద్దర్

చిక్కడపల్లి: శబ్దం మనిషి గుండెల్ని చీల్చుకుపోతుందని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. మానవీయమైన మంచిశబ్దం మనసు అంతరాల్లోకి వెళ్తుందన్నారు. నివేదిత సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. గాయకులు సుభాష్, నవరసగాయని ఆమని ఆధ్వర్యంలో 'మరాలి మనుషుల నడవడి మారాలి' శీర్షికతో నిర్వహించిన ద్విభాషా సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ జర్నలిస్ట్ రఫీ, ఆచార్య ఎం.శివకుమార్, దైవజ్ఞశర్మ, రాందాస్, తాటికొండ కమలయ్య, భోగరాజు, సుభాష్, వేంకటేశ్వరరావు తదితరులున్నారు.

ముగిసిన ఉచిత కాలిగ్రఫీ శిక్షణాతరగతులు

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో 15 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ వేమూరి తాండవ కృష్ణ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయన్నారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ ఎన్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అకాడమీ 53 మందికి ర్యాంకులు


నిధిపాయ్‌ను సన్మానిస్తున్న అకాడమీ ప్రతినిధులు

చిక్కడపల్లి: ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల మరోసారి ప్రతిభ చూపించారని శరతచంద్ర ఐఏఎస్ అకాడమీ అధినేత తోట శరతచంద్ర అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థుల్లో 53 మందికి ర్యాంకులు వచ్చాయని వారిలో 19 మంది తెలంగాణ, తెలుగు వారు సాధించడం గర్వకారణమన్నారు. చిక్కడపల్లికి చెందిన నిధిపాయ్‌కు మూడో ప్రయత్నంలో 110వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న కుమారస్వామి

కాచిగూడ: మహిళలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా అందరూ.. సంఘటితంగా కృషి చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి పిలుపునిచ్చారు. బుధవారం కాచిగూడలో జరిగిన బీసీ దళ్ మహిళా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళాబిల్లును ప్రవేశపెట్టి మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతను ప్రదర్శిస్తోందని ఆరోపించారు. దేశంలో ఉన్న మెజార్టీ ప్రజలైన బీసీలు ఇప్పటికీ అన్ని రంగాల్లో వెనుకబడే ఉన్నారన్నారు. పార్లమెంట్‌లో మహిళాబిల్లు పెట్టి మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ దళ్ మహిళా ప్రతినిధులు దివ్య, లలిత, అంకమ్మ, బీసీదళ్ నేతలు అయ్యాన్, సాయియాదవ్, శ్రీను, అఖిల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం వద్దు


జీహెచ్‌ఎంసీ అధికారులతో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నెరమేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ కుద్బిగూడలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మురుగుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారులకు చూపించారు. జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్ జ్యోతిబాయి, ఎస్ఎఫ్ఏ విష్ణులతో కలిసి కుద్బిగూడలో కార్పొరేటర్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్త పాయింట్‌ను ఇక్కడి నుంచి ఎత్తివేయాలని అధికారులకు సూచించారు. రోజుకు రెండుసార్లు చెత్తను ఎత్తివేసేలా చూడాలని ఆమె కోరారు. బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, మంజునాథ్, ప్రగ్నా, డాక్టర్ శశాంక్, హరిష్, శరత్, భీమ్‌రాజ్, వాసు, సూరి, రవియాదవ్, సంతోష్, దినేష్ తదితరులున్నారు.

బీసీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలి


మాట్లాడుతున్న తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్

కాచిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 54 శాతం ఉన్న బీసీలు పారిశ్రామికరంగంలో 10 శాతానికి మించి లేరన్నారు. పారిశ్రామిక రంగంలో బీసీలకు రాయితీలను ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, పారిశ్రామికీకరణతో ప్రైవేట్ రంగంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం వలన బీసీ చేతివృత్తులు దెబ్బతిని లక్షలాది మంది ఉపాధిని కోల్పోయారన్నారు. బీసీలు పారిశ్రామిక రంగంలో రాణించేలా ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేరం శివనాగేశ్వర్ రావు, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్‌నిమ్‌కర్, కిషోర్, కృష్ణ, భూషణ్ భాస్కర్ తదితరులున్నారు.

కూచిపూడి నృత్య సంగీత పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర, సుధామాల, విజయకుమార్

చిక్కడపల్లి: కూచిపూడి నృత్య సంగీతంపై ఈనెల 27న శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయంలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్ఠ సుధామాల ప్రకటించారు. బుధవారం ప్రత్యేక పోస్టర్‌ను జి.వసుంధరల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్య విభాగం గాయకులు, ప్రముఖ నృత్య సంగీత దర్శకులు డీఎస్‌వీ శాస్త్రి నృత్యసంగీతంపై సోదాహరణ ప్రసంగం చేస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత విద్వాంసులు ఆనందమోహన్, గౌరవ అతిథులుగా ప్రముఖ నృత్యగురువు కళాకృష్ణ, భాగవతుల సేతురామ్‌లు పాల్గొంటారన్నారు. వసుంధర మాట్లాడుతూ.. నాట్యానికి సంగీతం ప్రాణమని నృత్యానికి భావయుక్తంగా శాస్త్రీయబాణీలో పాట పాడాల్సి ఉంటుందన్నారు. నారపరాజు, శ్రీలత, స్నేహ, అన్నమయ్య మిషన్ ట్రస్టీ గోదాలక్ష్మి పాల్గొన్నారు.

చేపలు పట్టే వృత్తిదారులకే చైర్మన్ పదవి ఇవ్వాలి


నిరసన ర్యాలీలో గంగపుత్ర సంఘం నాయకులు

కవాడిగూడ: చేపలు పట్టే నిజమైన వృత్తిదారులకే మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పదవి ఇవ్వాలని భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కే.ఎం శంకర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చేపలు పట్టే నిజమైన గంగపుత్రులకే చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ.. భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌజ్ వద్ద డివిజన్ సంఘం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. నిజమైన చేపలు పట్టే వృత్తిదారులైన గంగపుత్రులకే చైర్మన్ పదవిని ఇచ్చి న్యాయం చేయాలన్నారు. ముదిరాజ్‌లకు వైఎస్ చైర్మన్ పదవి లేదా ఇతర పదవులను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. గంగపుత్ర సంఘం సలహాదారులు గోపాల్, శంకర్, సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, ఉపాధ్యక్షుడు అనీష్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కె.స్వరూప, శివరాణి, సంఘం బిల్డింగ్ అధ్యక్షుడు కే.ఎం సాయి, నాగేందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'ఫీవర్' భవన నిర్మాణ పనులు

- ఏడాది క్రితం రూ. 10.91 కోట్లతో శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్‌రావు
- తొలి, మలి విడత రూ.7 కోట్లు మంజూరు


ఫీవర్‌లో కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులు

నల్లకుంట: పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణంలో నూతన చేపట్టిన భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోవిడ్-19కి ముందు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనికి అవసరమైన రూ. 13 కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో కోవిడ్ మహమ్మారితో పనులు ముందుకు సాగలేదు. అనంతరం భవన నిర్మాణం ప్లాన్‌లో మార్పులతో మరింత ఆలస్యమైంది. ఆ తర్వాత వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తన్నీరు హరీష్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని సీఎంతో చర్చించి ఫీవర్‌లో నూతన భవన నిర్మాణానికి ఐపీఎం పబ్లిక్ హెల్త్ ల్యాబరేటర్ డెవలప్‌మెంట్ సొసైటీ(పీహెచ్ఎల్‌డీఎస్) నిధులను మంజూరు చేయాలని ఆదేశించారు.

– గతేడాది ఫిబ్రవరి 12న నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో రూ. 10.91 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న ఔట్ పేషెంట్ బ్లాక్ (ఓపీబీ బ్లాక్) నూతన భవన నిర్మాణ పనులకు టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్, ఎండీ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఇతర అధికారులతో కలిసి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఏడాది గడిచినా.. మొదటి అంతస్తు గోడల నిర్మాణం సగం కూడా పూర్తి కాలేదు. పనుల్లో జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం లేకపోలేదు.

మిగిలిన నిధుల మంజూరులో జాప్యం..

ఐపీఎం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ఫీవర్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో తొలి విడతగా రూ. 3.5 కోట్ల చెక్కును టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ కె.చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. కొన్నాళ్లకు ఐపీఎం డైరెక్టర్‌గా పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టిన శివలీల మరో రూ.3.5 కోట్ల చెక్కును టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీకి పంపించారు. మిగిలిన డబ్బులు కూడా త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

పనుల్లో ఆలస్యం జరుగడం లేదు..



నూతన భవనాల నిర్మాణంలో ఆలస్యం జరుగడం లేదు. దశాబ్దాల పాటు మన్నికగా ఉండాల్సిన భవన నిర్మాణానికి అనుగుణంగా పునాదుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో పునాదుల కోసం తవ్వకాలు చేపట్టిన సమయంలో పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డంకిగా మారాయి. వాటిని తొలగించడానికే ఎక్కువ సమయం పట్టింది. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ నిర్మాణం పూర్తికాగా.. గోడల నిర్మాణపనులు సాగుతున్నాయి. మొదటి, రెండో అంతస్తు నిర్మాణపనులు వేగవంతంగా కొనసాగుతాయి.

– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ సూపరింటెండెంట్